

# కొనసాగుతున్న భక్తుల రద్దీ

## -వెంకన్న దర్శనానికి 35గంటలపైనే

తిరుమల,ఆగస్టు 17 ప్రభాతవార్తప్రతినిధి:
వరుససెలవులు ...వారాంతం కలసి రావడంతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారింది. భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం ఉదయం కూడా యధావిధిగా భక్తుల లైన్లు ఆలయం వెలుపల ఐదుకిలోమీటర్లు చేరాయి. 25గంటలు కంపార్టుమెంట్లలో ఉన్నవారికి కేటాయించగా, వెలుపల వున్న భక్తులకు 35గంటలుపైగానే నిరీక్షణ తప్పడంలేదు. ఈ రద్దీ మరో మూడురోజులు కొనసాగుతుందని భావిస్తున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఉల్లాసంగా...ఉత్సాహంతో
# ఉట్టికొట్టిన యువకులు

### ఆద్యంతం పర్యవేక్షించిన మలయప్ప,శ్రీకృష్ణస్వామి



తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:
సాయంసంధ్యవేళ చిరుజల్లులు దేవదేవుడ్ని పలకరించగా శ్రీకృష్ణాష్టమి పర్వదినం ముగిసిన మరుసటిరోజు తిరుమలలో ఆదివారం సాయంత్రం ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. మధ్యాహ్నం ఆలయం నుండి శ్రీమలయప్ప స్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై ఉత్సవమూర్తులను పెద్దజీయర్ మఠానికి మంగళవాయిద్యాల నడుమ వేంచేపు చేశారు.. ఇక్కడ వేదోక్తంగా ఆస్థానం చేపట్టారు. ప్రసాద నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. అక్కడ నుండి ఆలయం ముందు ప్రత్యేక పూజలు, నివేదనలు అందుకుని యువకులు ఉట్టికొట్టడాన్ని స్వయంగా ఉత్సవమూర్తులు పర్యవేక్షించారు. యువకులు ఆద్యంతం కోలాహలంగా ఉట్లోత్సవంలో ఉట్టికొట్టి గోవింద నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం దంపతులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# మళ్లీ మారనున్న రూపు.. హద్దులు!



### డిసెంబర్ నాటికల్లా ఉమ్మడి చిత్తూరు జిల్లా పునర్విభజన కొలిక్కి!!
### జరిగితే తిరుపతి.. చిత్తూరు జిల్లాల్లో పది నియోజకవర్గాలే..?

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త
ఉమ్మడి చిత్తూరు జిల్లా రూపు, హద్దులు మరోమారు మారనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ నేతృత్వంలో నియమించిన మంత్రుల సబ్ కమిటీ ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా జిల్లాల పునర్విభజన అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ప్రభుత్వం నియమించిన కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని జిల్లాలకు తుదిరూపు ఇవ్వనుంది. గత వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జిల్లాల పునర్విభజన సందర్భంగా పలు అభ్యంతరాలు ఏర్పడినా అప్పట్లో జిల్లాలను విభజించేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అప్పట్లో 14 నియోజకవర్గాలు ఉండేవి. వీటిలో ఏడు నియోజకవర్గాలు కుప్పం, పలమనేరు, చిత్తూరు, పు ంగనూరు, పూతలపట్టు, నగరి, జిడి నెల్లూరు నియోజకవర్గాలను చిత్తూరు జిల్లాగా విభజించారు. ఉమ్మడి జిల్లాలోని మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలు అన్నమయ్య జిల్లాలో చేరాయి. ఇక తిరుపతి జిల్లాలో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పుత్తూరు, నెల్లూరు జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలను కలిపేశారు. దీంతో తిరుపతి జిల్లా నెల్లూరుజిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వ్యాపించింది. తిరుపతికి సమీపంలో ఉన్న నగరి నియోజకవర్గాన్ని, మదనపల్లికి సమీపంలో ఉన్న పుంగనూరు నియోజకవర్గాన్ని చిత్తూరులోనే ఉంచేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక జిల్లాల పునర్విభజన అంశం మరోమారు తెరపై వచ్చింది. జిల్లాల విభజన హేతబద్ధంగా జరగలేదని భావించిన ప్రభుత్వం దీనిపై మంత్రులతో కమిటీ ఏర్పాటుచేసి ఈ అ ంశాన్ని కొలిక్కి తేవాలని నిర్ణయించింది. దీంతో డిసెంబర్ నెలాఖరులోగా మంత్రుల కమిటీ జిల్లాల పునర్విభజన అంశాన్ని ప్రజాభిప్రాయం మేరకు పూర్తి చేయాలని నిర్ణయించింది.

**తిరుపతి..చిత్తూరుకు పాత నియోజకవర్గాలే..?**

కాగా జిల్లాల పునర్విభజన అంశం తెరపై రావడంతో మరోమారు కొత్త జిల్లాలు ఏర్పాటయ్యే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరు, సూళ్లూరు పేట ప్రాంతాలను కలిపి ప్రభుత్వం గూడూరును కొత్త జిల్లాగా ఏర్పాటుచేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇదే జరిగితే మరలా ఉమ్మడి చిత్తూరు జిల్లా స్వరూపం మారుతుంది. తిరుపతి జిల్లాలో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పుత్తూరు, నగరి నియోజకవరాలతో రూపాంతరం చెందనుంది. ఇక చిత్తూరు జిల్లాలో ఉన్న పు ంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలిపేస్తే కుప్పం, పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, జిడి నెల్లూరు నియోజకవర్గాలు చిత్తూరు జిల్లా పరిధిలో వచ్చే అవకాశాలు ఉంటాయి. ఏది ఏమైనా మంత్రుల సబ్ కమిటీ ఏమేర జిల్లాలను పునర్విభజిస్తుందో మరో నాలుగు నెలల్లో తేలిపోతుంది.




ప్రస్తుత తిరుపతి..చిత్తూరు జిల్లాల మ్యాప్‌లు

# మందుప్రియులకు అర్ధరాత్రి రిలాక్స్!

### -మద్యంబార్లకు పెరిగిన సమయం





ప్రభాతవార్త-తిరుపతి:
మందుబాబులు అర్ధరాత్రి వరకు మద్యంసేవించే సమయం త్వరలోనే అమలుకానుంది. ఇందుకు ప్రభుత్వం నూతన మద్యంబార్ల పాలసీని రూపొందిచింది. సెప్టెంబర్ 1వతేదీ నుండి బార్లు ఉదయం 10గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు తెరచివుంచి మందుబాబులకు ఇష్టమొచ్చినంతవరకు తాగే అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటికే మద్యం దుకాణాలు ఉదయం 11గంటల నుండి రాత్రి 10గంటల వరకు తెరచి ఉంచి మందుప్రియులకు ఇష్టమైన నాణ్యమైన మద్యం విక్రయిస్తున్నారు. ఇలా దుకాణాల్లో కొనుక్కున్న మందు తాగేందుకు సరైన సౌకర్యాలు లేవు. ఇకనుండి మద్యంషాపుకు అనుబంధంగానే సిట్టింగ్ రూమ్‌లకు అనుమతి నిచ్చింది. ఇష్టమొచ్చిన మద్యంసేవించి కాసేపు రిలాక్స్ అయ్యేలా పర్మిట్ రూమ్స్ తెరచుకోనున్నాయి. ఇప్పటికే తిరుపతి,చిత్తూరు జిల్లాల్లో తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, మంగళం, ఆర్‌సిపురం, పాకాల, పూతలపట్టు, చిత్తూరు,పలమనేరు శ్రీకాళహస్తి, నగరి,సత్యవేడు, జిడినెల్లూరు ప్రాంతాల్లో మద్యందుకాణాలకు అనుబంధంగా కొన్నిచోట్ల రేకుల షెడ్లు వెలిసి అనధికారికంగా అక్కడే మద్యం తాగించేస్తున్నారు. ఇప్పుడు ఇవన్నీ అధికారికంగా రావడంతో ఇక మద్యంప్రియులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొందరు ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు.యువత రిలాక్స్ కోసం బార్‌కు వెళ్ళి మద్యం సేవించడం పరిపాటిగా మారింది. తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి పుణ్యక్షేత్రాల్లో కూడా మద్యం బార్లు ఉండటంతో యాత్రికులు గతంలో రాత్రి 11గంటలు దాటితే మందుసేవించే అవకాశం లేదు. రానున్న రోజుల్లో అర్ధరాత్రి 12గంటల వరకు బార్లలో మందుతాగే అవకాశం కలిగింది. ఇందుకు తగిన నిర్ణీత ఫీజులు కూడా ప్రభుత్వం ఖరారుచేసింది. తిరుపతి,చిత్తూరు ,శ్రీకాళహస్తి వంటి ప్రాంతాల్లో యాత్రికుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. అదేగాక పలుచోట్ల నుండి పలురకాల పనుల నిమిత్తం తిరుపతికి వస్తుంటారు. వచ్చిన వారిలో కొందరు రిలాక్స్ కోసం మందుసేవిస్తే కొందరు అలవాటుగా మద్యం తాగడం పరిపాటి. ఇలాంటి వారికోసం ఇప్పుడు సమయం కూడా అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం తిరుపతిలో 20వరకు బార్లు ఉన్నాయి. ఇవన్నీ కూడా మద్యం ఎంఆర్‌పి ధరకంటే కొంత అధికంగానే రేట్లు ఉన్నాయనేది మద్యంప్రియులు చెబుతున్నారు. 50వేల లోపు జనాభా వుంటే 35లక్షలు రూపాయలు, 5లక్షలలోపు జనాభా ఉండే ప్రాంతాల్లో 55లక్షలు. 5లక్షలు పైన జనాభా ఉండే ప్రాంతాల్లో 75లక్షలు రూపాయలుగా బార్లకు ఫీజు నిర్ణయించిన ప్రభుత్వం అందుకు తగ్గట్లు మద్యం అమ్మకాలు పెంచుకునేందుకు వీలు కల్పించింది. ఇప్పటికే నడుస్తున్న బార్లకు తోడుగా మరిన్ని బార్లు రానున్నాయి. ఓ వైపు బార్ల యజమానులు మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్స్ ఇవ్వడంపై నిరసన తెలియజేస్తున్నారు.

## సినిమాకు వెళ్తే
# జేబుకు చిల్లులే

### హడలెత్తిస్తున్న సినిమా థియేటర్ల టికెట్ ధరలు
### జీఎస్‌టి పేరుతో మరో దోపిడీ
### గబ్బుకొడుతున్న బాత్‌రూమ్‌లు
### ఇదీ శ్రీకాళహస్తిలో థియేటర్ల పరిస్థితి



థియేటర్‌లో గబ్బుకొడుతున్న బాత్‌రూమ్‌లు

శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలో సినిమా అభిమానుల అభిమానాన్ని సినిమా థియేటర్స్ యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ టిక్కెట్లు 300 నుంచి 400రూపాయలకు ఖరారు చేసి వసూలు చేసుకుంటున్నారు. టిక్కెట్లు కాకుండా జిఎస్‌టి పేరుతో మరో రకం దోపిడి. ఇక సినిమాకు పిల్లలతో వెళ్లిన వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. మాల్స్,మల్టి మెగా టాకీస్‌ల పేరిట దోపిడి. చెప్పిందే రేటు, అమ్మిందే ఎంఆర్‌పి టిక్కెట్లు నుంచి స్నాక్స్ వరకు భారీగా పన్ను.బలవంతంగా పార్కింగ్ వసూళ్ళు.దాంతో సినిమా పిచ్చి వీడని ప్రేక్షకులు మళ్ళీ పాత రోజులు వస్తే బాగుంటుందని భావిస్తున్నారు. ఇక శ్రీకాళహస్తిలోని పాత వరదయ్యపాళెం రోడ్డులోని ఓ స్టార్ థియేటర్‌లో పరిస్థితి ఆగమ్యగోచరం. ఫ్రెండ్లీకాంబోల పేరుతో రూ.వెయ్యి వసూలు చేసుకుంటున్నారు.పార్కింగ్ ఫీజు ద్విచక్రవాహనానికి రూ.20,కారు అయితే రూ.100 ఇవ్వాల్సిందే.కోర్టులు పార్కింగ్ ఫీజులువసూలు చేయరాదని చెబుతుంటే శ్రీకాళహస్తిలో మాత్రం బలవంతపు పీజులు వసూలు చేస్తున్నారు.ఇక సీట్ల పరిస్థితి ఇక అత్యవసరంగా బాత్‌రూంకు వెళితే ముక్కులు మూసుకొని వెళ్ళాల్సిందే.కూల్‌డ్రింక్ తాగాలంటే లేని దాహం వేస్తుంది. ధరలు చూస్తే తడారిపోతుంది.ఎవరైనా ప్రశ్నిస్తే మేమింతే అంటూ బెదిరిస్తుడడం గమనార్హం.

# అ రోడ్డుపై ప్రయాణమంటే నరకమే!

### ఎన్నాళ్లీ యాతన ... పట్టించుకునే వారేరీ?



నాయుడుపేటకు వేళ్లే రోడ్డు

కోట, ఆగస్టు 17 ప్రభాతవార్త
కోట మండలం విద్యానగర్ నుంచి చిట్టమూరు మండలం గున్నపాడు వరకు ఆర్‌అండ్‌బి రహదారి అత్యంత దయనీయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును గాలికి వదిలేయడంతో ఐదు కిలోమీటర్ల పరిధిలో 100 గుంతలు ఏర్పడి నరకాన్ని తలపిస్తోంది. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం కష్టంగా మారింది. ఉయ్యాల-జంపాల మాదిరి ప్రయాణం గుర్తుకొస్తుంది. విద్యానగర్ నుంచి గున్నపాడు వరకు ప్రయాణం చేయాలంటేనే భయం వేస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై దృష్టి సారించింది. అయితే ఈరోడ్డు పై పడిన గుంతలు పూడ్చటంలో ఆటు అధికారులు ఎందుకు జాప్యం చేస్తునారో ప్రజలకు అర్థం కావడం లేదు, ఆర్‌అండ్‌బి అధికారులు కనీసం గుంతలైన పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. రోజూ కోట నుంచి నాయుడుపేటకు బస్సుల్లో వందలాది మంది ప్రయాణం చేస్తున్నారు.ఈ రహదారిపై అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వెళుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రహదారికి తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అన్యమత ఉద్యోగులకు విఆర్ఎస్!

### -చెన్నైలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు



తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:
టిటిడిలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్ ,ఇతర ప్రభుత్వ శాఖలకు బదలాయించేందుకు కసరత్తు చేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. తనకు చిన్నప్పటినుండి కష్టపడటం తప్ప మరొకటి తెలియదన్నారు. తిరుమలలో సామాన్యభక్తులకు మెరుగైన సేలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. చెన్నై పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును చెన్నై తెలుగుసంఘం ఘనంగా పన్మానించింది. అయ్యావూమహల్‌లో జరిగిన కార్యక్రమంలో తమిళనాడు మున్సిపల్ శాఖమంత్రి కెఎన్ నెహ్రూ, మానవవనరులశాఖమంత్రి పికె శేఖర్‌బాబు గజమాలతో నాయుడును సత్కరించారు. ఛైర్మన్‌గా చేస్తున్న విశేషసేవలకు సన్మానం జరిగింది. టిటిడి ఛైర్మన్‌గా ఆయన శ్రీవారి ఖ్యాతిని మరింతగా విశ్వవ్యాప్తం చేస్తున్నారని పలువురు ప్రముఖులు, ఐఏఎస్.ఐపిఎస్ అధికారులు, విశ్రాంత న్యాయమూర్తులు కొనియాడారు.

# పనులు ఆపటం.. యంత్రాలు ధ్వంసం చేస్తామనటం తగదు

### విధులకు ఆటంకం పరచిన ఐదుగురిపై కేసు
### అటవీశాఖాధికారి లోకేష్

తొట్టంబేడు,ఆగస్టు 17 ప్రభాతవార్త
అటవీశాఖ పనులకు ఆటంకం పరచటం, యంత్రాలను ధ్వంసం చేస్తామని బెదిరించటం సహించమని శ్రీకాళహస్తి అటవీశాఖాధికారి లోకేష్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేసారు.విధులకు ఆటంకం కల్పించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.అటవీశాఖ భూములపై ఎవ్వరికి ఎలాంటి అధికారం ఉండదని ఒక వేళ గ్రామస్తులకు ఏదైనా హక్కులుంటే నిరూపించుకోవాలని లోకేష్ స్పష్టం చేసారు.

**అభివృద్దిని అడ్డుకుంటున్న సింహాచల కండ్రిగ గ్రామస్తులు:**
శ్రీకాళహస్తి ఇలగనూరు ఫారెస్టురేంజి పరిధిలోని భూములు రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించివనిఅటవీశాఖాధికారి లోకేష్ స్పష్టం చేసారు. ఈ భూములకు సంబంధించి రెవెన్యూశాఖాధికారులు పట్టాలిచ్చే అధికారం లేదన్నారు.ఈ భూముల్లో అటవీశాఖ అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. ఇక్కడ అటవీశాఖ అధికారులు, సిబ్బంది చేపట్టే పనులకు ఆటంకం కల్గిస్తే చర్యలు తతీసుకుంటామని లోకేష్ వివరించారు.ఇక్కడ 608 ఎకరాల ఫారెస్టు రేంజ్ భూములున్నాయని వివరించారు. వీటిలో 71 హైవే కోసం భూసేకరణ కోసం 40 ఎకరాలు ప్రభుత్వం సేకరించిందన్నారు.ఇక్కడ భూములను 90 ఎకరాల్లో అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇలగనూరు పరిధిలో 50 ఎకరాల్లో అభివృద్ధి చేయటానికి పనులు చేపడుతుంటే సింహాచలకండ్రిగ గ్రామానికి చెందిన వారు తరచూ అభ్యంతరాలు చెబుతున్నారన్నారు. అయితే వీటిపై హైకోర్టులో కేసులు కూడా నడుస్తున్నాయని లోకేష్ వివరించారు. హైకోర్టు కూడా ఇదిరిజర్వ్ ఫారెస్టు అని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ భూములు ఫారెస్టుకింద ఉన్న దృష్ట్యా రెవెన్యూ అధికారులకు పట్టాలు ఇచ్చే అధికారం లేదన్నారు. గ్రామస్తులు ఈ విషయాన్ని గుర్తించి భూముల్లో చేసే అభివృద్ధి పనులు అడ్డుకుంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అటవీశాఖాధికారి లోకేష్

**ఐదు మందిపై కేసులు:**
ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఇలగనూరు రిజర్వ్ పారెస్టు భూములను అభివృద్ధి పరచుటకు పలుమార్లు ప్రయత్నిస్తున్నా సింహాచల కండ్రిగ గ్రామానికి చెందిన పలువురు అడ్డుకుంటున్నారని అటవీశాకాధికారి లోకేష్ స్పష్టం చేసారు. ఈ నెల 11న కూడా గ్రీనరి కోసం వెళితే అడ్డుకోవటమే కాకుండా యంత్రాలను ధ్వంసం చేస్తామని బెదిరించటం శోచనీయం అన్నారు. ఈ నేపథ్యంలో తరచూ పనులను అడ్డుకుంటూ ఇబ్బంది కల్గిస్తున్న సింహాచల కండ్రిగకు చెందిన కే.కోటయ్య, సాంబశివయ్య, తిరుపాలయ్య, బండిప్రసాద్, కే.శంకరయ్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసామని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై
# రెండు మేకలు మృతి

పుత్తూరు రూరల్,
ఆగస్టు 17 ప్రభాతవార్త:
విద్యుత్‌షాక్‌కు గురై రెండు మేకలు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం పుత్తూరు పట్టణ పరిధిలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వినాయకపురం బీసీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కూడా మేకలను మేతకు తీసకెళ్లాడు. ఆదివారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో ఈ నేపథ్యంలో మేకలను ఇంటికి తీసుకొచ్చే క్రమంలో గ్రామానికి వచ్చే దారిలో సింగిల్ ఫీజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ పాస్ అయి రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామస్తులు సకాలంలో స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. మృతి చెందిన మేకల విలువ రూ.20 వేలు వరకు ఉంటుందని విద్యుత్‌శాఖ ఆరైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన రెండు మేకలు

# పేదల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ విప్ డా।। కంచర్ల శ్రీకాంత్

- 40లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ !!

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త

కుప్పం ప్రాంతంలోని పేదల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా।। కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 40లక్షల రూపాయల చెక్కులను మండల, మున్సిపల్ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్‌లతో కలిసి బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాలతో పోల్చితే కుప్పం నియోజకవర్గానికి సిఎం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి




సహాయనిధి కింద సాయం అందిస్తున్నారన్నారు. కుప్పం ప్రజల కోసం ఆయన నిరంతరం పనిచేస్తున్నారన్నారు. ఈసందర్భంగా బాధిత కుటుంబాలు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞ తలు తెలిపాయి. కార్యక్రమాల్లో రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కడ సభ్యులు రామచంద్ర, సుగుణమ్మ, రఘు, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, నేతలు సత్యేంద్రశేఖర్, చంద్ర, జనార్ధనరెడ్డి, ఉదయ్, హేమాంబరగౌడు, వెంకటేష్, బాలాజీ, మహేంద్ర, మురళి

## జగనన్న కాలనీలో గుండాల గంగమ్మ తిరునాళ్ళు

తిరుపతిరూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఆదివారం గండాల గంగమ్మ తిరునాళ్ళు వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ళులో పెద్దఎత్తున పాల్గొని, పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జగనన్న కాలనీ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఇనగలూరులో అటవీశాఖతో స్థానికుల 'వార్'

### నిధులు మంజూరు అయినా అడ్డుకుంటున్న స్థానికులు

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు గ్రామంలో అటవీశాఖకు సంబంధించిన భూముల వివాదం దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఈ వివాదాలు తారాస్థాయికి చేరుకుని చివరకు కేసుల వరకు చేరింది. ఆదివారం అటవీశాఖాధికారులు సింహాచల కండ్రిగకు చెందిన ఐదుగురిపై పోలీసు కేసు బనాయించటం గమనించదగ్గ విషయం.శ్రీకాళహస్తి మండలంలోని పల్లం సెక్షన్ పరిధిలో మన్నవరం బీటు ఇలగనూరు రిజర్వ్ అటవీ యందుక్యాంపా-సిఏ స్కీంలో ప్రభుత్వం రూ.62లక్షలు నిధులు మంజూరు చేసింది.ఈ నిధులతో 50హెక్టార్లలో మొక్కలు నాటాల్సి ఉందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమాలను ఆచరించుటకు మూడునెలలుగా అటవీశాఖాధికారులు ప్రయత్నిస్తున్నారు.కానీ ఎందుకో స్థానికంగా కొందరు తమకు పట్టాలున్నాయని పేచీ పెడుతూ అడ్డుకుంటున్నట్లు అటవీశాఖాధికారులు చెబుతుంటే తమకు రెవెన్యూశాఖ పట్టాలిచ్చిందని స్థానికులు అడ్డుకుంటున్నారు. ఇక్కడి అటవీశాఖ భూములకు సమీపంలోని సింహాచల కండ్రిగ గ్రామానికి చెందిన కొందరు తమకు రెవెన్యూశాఖ డికెటి పట్టాలు ఇచ్చిందని వాదిస్తున్నారు.

**కోర్టుల వరకు వెళ్ళిన సమస్య:**

శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు సమీపంలోని పల్లం అటవీశాఖ పరిధిలో అటవీశాకు సంబంధించి సుమారు 600 ఎకరాలకు పైగా భూములున్నాయి.ఈ వివాదాలకు సంబంధించి 2010లో సింహాచలకండ్రిగకుచెందిన పలువురు హైకోర్టుకు ఆశ్రయించారు. తమకు రెవెన్యూశాఖ పట్టాలిచ్చిందని విన్నవించుకున్నారు.వాదోపవాదాలు,వాస్తవ పరిస్థితిని పరిశీలించిన హైకోర్టు ఈ భూముల అటవీశాఖ అందించిన సమాచారం మేరకు కేసును తోసివేస్తూ మూడు నెలల లోపల రెవెన్యూ మరియు అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే చేయాలని ఈ వివాదాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకోవాలని తీర్పు చెప్పారు.కోర్టు ఆదేశాల మేరకు అటవీ,రెవెన్యూశాఖలు జాయింట్ సర్వే చేసి ఈ భూములు రిజర్వ్ ఫారెస్టే లని జిల్లాకలెక్టర్‌కు నివేదిక పంపారు. తరువాత రెవెన్యూశాఖ గతంలోజారి చేసిన పట్టాలు రద్దు అయినట్లు చెబుతున్నారు. అంతేకాక ఈ వివాదాస్పదభూమి 1970లోనే రిజర్వ్ ఫారెస్టు భూమిగా డిక్లేర్ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి.

**అభివృద్ధి అడ్డుకుంటున్న గ్రామస్తులు:**

శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు సమీపంలోని రిజర్వ్‌ఫారెస్టు భూములకు సంబంధించి అభివృద్ధికి ఇక్కడ ట్రీప్లాంటేషన్‌కు ప్రభుత్వం రూ.62లక్షలు నిధులు మంజూరు చేసారు. ఇక్కడ చెట్లు నాటేందుకు ఈ నెల 11న అటవీశాఖాధికారులు వెళ్ళగా సింహాచలం కండ్రిగ గ్రామస్తులు అడ్డుకోవటంతో వివాదం పెరిగింది.ఈ నేపథ్యంలో అటవీ శాఖాధికారులు చట్టాలను ఉపయోగించటానికి సిద్ధపడుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేయటానికి 144 సెక్షన్‌ను విధించుటకు రంగం సిద్ధం చేస్తున్నారు.దాంతో ఇక్కడ శాంతి భద్రతల సమస్య ఏర్పడే అవకాశం లేకపోలేదు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

తిరుపతి హెల్త్, ఆగస్టు 17 ప్రభాతవార్త ః



మాజీ మంత్రి పరసారత్నం భార్య స్వర్గీయ కస్తూరమ్మ 5వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్, డాక్టర్ అంబేద్కర్ పూలే పౌండేషన్ ఛైర్మన్ పరసారత్నం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నెహ్రు మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర హాజరై మాట్లాడుతూ పరసారత్నం అందరివాడు అని కొనియాడారు. తన భార్య జ్ఞాపకార్థం శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానాలు చేయడం, 28 ప్రైవేట్, ప్రభుత్వ, టీటీడీ కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు, డాక్టర్ల బృందం, సిబ్బంది ఉచితంగా రోగులకు అన్ని పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. పరసారత్నం మాట్లాడుతూ తాను ఎల్లవేళలా విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కల్లూరు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ మంచి మనస్సున్న వ్యక్తి పరసారత్నం అని కొనియాడారు. కస్తూరమ్మ 5వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు, రక్తదానాలు, ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పలువురిని మంత్రి, పరసారత్నం, నాగరాజు గౌడ్ శాలువు, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఎస్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కల్లూరు భరత్‌కుమార్, అన్ని కుల సంఘాల ప్రతినిధులు ఆల్మెన్ రాజు, నరసింహయాదవ్, సుగుణమ్మ, సీఆర్ రాజన్, మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ, పరసారత్నం అల్లుడు సతీష్ చంద్ర, పరమశివం, నగేష్, పరసారత్నం కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

చిత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు డిగ్రీ నందు ప్రవేశానికి ఈనెల 18వ తేది నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నోడల్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ డా. జీవన్‌జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. పివికెయన్ కళాశాలలో బిఏ( హిస్టరీ, ఎకనామిక్స్ పొలిటికల్ సైన్స్), బికాం( జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్ అండ్ ఇన్యూరెన్స్) బిబిఏ( లాజిస్టిక్ మేనేజ్‌మెంట్), బియస్సీ (మాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, అప్లైయిడ్ కంప్యూటర్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, డైరీసైన్స్) కోర్సులతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన బిఎస్సీ( ఎలక్ట్రానిక్స్) ఉన్నత విద్యామండలి అనుమతి ఇచ్చిందన్నారు. డిగ్రీలో చేరదలచిన, ఆశక్తి కలిగిన విద్యార్థులు తమ సర్టిఫికేట్లతో ధరఖాస్తులు చేసుకోవచ్చునని, ఇతర వివరాలకు బిఏ( 9494368020), బికాం(9849959423), బియస్సీ( 9985165051)లను సంప్రదించాలని కోరారు.

## ఘనంగా చిత్తూరులో ఏపియుడబ్ల్యుజె ఆవిర్భావ వేడుకలు

చిత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:




చిత్తూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యుజె) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగనపల్లి నందు వున్న పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో వున్న నిరాశ్రయులకు, వృద్ధులకు అన్నదానం, తపోవనంలోని వృద్ధులకు రొట్టెలను పంచిపెట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షులు లోకనాధన్, చిత్తూరుప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబులు మాట్లాడుతూ ఇండియన్ జర్నలిస్టు యూనియన్(ఐజెయు)కు అనుబంధంగా వున్న ఎపియుడబ్ల్యుజె దేశంలోనే అతిపురాతన చరిత్ర కలిగిన జర్నలిస్టుల యూనియన్ అని, భారతదేశ జర్నలిస్టు పితామహులు మూనికొండ చలపతిరావు జ్ఞాపకార్థం ఏపియుడబ్ల్యుజె ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి బి మురళీక్రిష్ణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కాళేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్‌కుమార్, రాష్ట్ర ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ సహాయకార్యదర్శి శివకుమార్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, కార్యవర్గసభ్యులు రామక్రిష్ణ, శివ, చంద్ర, రాజేష్, సీనియర్ పాత్రికేయులు చంద్రశేఖర్, చంద్రప్ర కాష్,రక్రష్ణసింగ్, శ్రీనివాసులు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

## మంత్రి నిమ్మల ఇంట శుభకార్యంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త



రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా।। నిమ్మల రామానాయుడు ఇంట జరిగిన శుభకార్యానికి ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల కుమార్తె శ్రీజ,పవన్‌ల నిశ్చతార్థ కార్యక్రమంకు ఆయన హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్య, సంక్షేమ మైలి వసతుల కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, కుప్పం గ ంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు పాల్గొన్నారు.అనంతరం వారు నిమ్మకూరులోని బాలుర, బాలికల హాస్టళ్లు, పాఠశాల, కాలేజ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అక్కడి వసతులు, ఆహారం, విద్యా ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మిథున్ రెడ్డి బెయిల్ కోసం అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

సదుం, ఆగస్టు 17, ప్రభాతవార్త



రాజంపేట పార్లమెంట్ సభ్యుడు స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కుమారుడైన పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైలు నుంచి బెయిల్ పై త్వరగా విడుదల కావాలని సదుం మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా యర్రాతివారిపల్లి కోట మలై అయ్యప్ప స్వామి ఆలయం లో 116 కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మిధున్ రెడ్డికి త్వరగా బెయిల్ వచ్చేలా చూడాలని స్వామి వారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, రమేష్ రెడ్డి, వైస్ ఎంపీపీలు ధనంజయ రెడ్డి, పుట్రాజు, సర్పంచ్ రమణ, రమణ రెడ్డి, ఎంపీటీసీలు వాసు, మల్లికార్జున, మాజీ సర్పంచ్ వెంకటరమణాచారి, శ్రీరాములు, నవీన్, సుబ్రహ్మణ్యం, ఈశ్వర్ రెడ్డి, బాలకృష్ణ, రమేష్, తిమ్మారెడ్డి, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

సోమల, ఆగస్టు 17, ప్రభాతవార్త

మండల కేంద్రమైన సోమల బస్టాండులో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ సోమవారం ఉదయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరి ప్రసాద్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. తొలుత సూరయ్య గారి పల్లి వద్ద జెండా ఆవిష్కరించి సభను ఉద్దేశించి ప్రసంగిస్తామన్నారు. అనంతరం సోమల బస్టాండులో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లా పార్టీ నాయకులు ఇందులో పాల్గొంటారని జనసేన కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి..

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 17 ప్రభాతవార్త

..ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మోర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్టు 18 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ శ్రీమతి ఎన్.మోర్య ఐఏఎస్ గారు తెలియజేశారు...

## రేపటితో ముగియనున్న డీఫార్మసీ ధరఖాస్తుల గడువు

తిరుపతి విద్య, ఆగస్టు 17 ప్రభాతవార్త

ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025 28 విద్యాసంవత్సరానికి సంబంధించి డీఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు ధరఖాస్తులకు మంగళవారంతో గడువు ముగయనుంది.డీ ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు వందశాతం ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉంటాయని,కోర్సు పూర్తి చేసి ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపల్ ధ్వారకనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో చెప్పారు. ఇంటర్ బైపీసీ,ఎంపీసీ చేసిన ఆసక్తి విద్యార్థులు,తల్లిదండ్రులు ప్రవేశాలకు సంబంధించి మరిన్ని వివరాల కొరకు కళాశాలలోని ఫార్మసీ విభాగాన్ని గానీ 9908857585,9966761446,9963541557 చరవాణి ద్వారా గాని సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు.

## 40 మందికి ఉచిత కంటి పరీక్షలు

కేవీబీ పురం, ఆగస్టు 17 ప్రభాతవార్త:

మండలంలోని కొండల ఆధారంలో భక్తకన్నప్ప కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 40 మందికి కంటిపరీక్షలు ఉచితంగా చేశారు. ఆదివారం పలువురికి ఉచితంగా కంటి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. మరి కొందరిని కంటి ఆపరేషన్లకు సిఫారసు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ దొరస్వామి, ప్రగతి సంస్థ సభ్యులు ప్రభాకర్, వైద్య సిబ్బంది భవాని ప్రియ పాల్గొన్నారు.

## తిరుపతిలో ఘనంగా ఏపియుడబ్ల్యుజే వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతిరూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏపియుడబ్ల్యుజే వ్యవస్థాపక అధ్యక్షులు మానికొండ చలపతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. యూనియన్ పోరాట పటిమలను గుర్తు చేసుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ కృషి మరవలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎం.ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్.మురళి, ఏపియుడబ్ల్యుజే రాష్ట్ర కార్యధర్శి ఎంఆర్‌పి రాజు, రాష్ట్ర సమితి సభ్యులు కృష్ణయ్య, తిరుపతి జిల్లా ప్రధాన కార్యధర్శి నరేంద్ర, సహాయ కార్యధర్శి పెద్దిరెడ్డి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనుబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.చంద్రశేఖర్‌రెడ్డి, రాధకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గురుకుల పాఠశాల అభివృద్ధికి చర్యలు

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి పరమ సముద్రం వద్ద గల డా।। బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా।। కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, కడ సభ్యుడు రాజ్‌కుమార్ తదితరులతో కలసి గురుకులాన్ని సందర్శించారు. ఈసందర్భంగా బాలికలతో మాట్లాడుతూ అక్కడ నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ఇచ్చిన మాట మేరకు తల్లికివందనం పథకం అమలు చేశారన్నారు. బాలికలు విద్యలో బాగా రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు ప్రతాప్‌సింహ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభివృద్ధి




రామకుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వ పాలనతోనే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన రామకుప్పంలో విలేకరులతో మాట్లాడారు.త్వరలోనేమహిళలకు నెల కు 1500రూ.ల సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. తల్లికి వందనం కింద పదివేల కోట్లు, అన్నదాత సుఖీభవలో 3173కోట్లు, దీపం పథకంలో 2684కోట్లు, పెన్షన్ల రూపంలో 33600కోట్లు అందించారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు. సమావేశంలో నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, వెంకటరామగౌడు, రఫీ, రామకృష్ణప్ప, కామరాజునాయక్, మనోహర్, నాగభూషణం పాల్గొ న్నారు.



## వామ్మో ఏడగుల సర్పం...!

చౌడేపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త

ఏడగులకు పైగా వున్న సర్పం రోడ్డు దాటుతూ గ్రామస్తుల కంట పడింది. దీంతో కేకలు వేసుకొంటూ పరుగులు తీశారు. మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లికి సమీపంలో నాయనిచెరువుంది. చెరువు కట్టపై రోడ్డును దాటుతూ గుడ్డుపింజరి కనిపించింది. కాలినడకన వస్తున్న వారందరూ అంత పొడుగాటి సర్పాన్ని చూసి భయాందోళన చెందారు. అయితే ఓ వ్యక్తి సర్పాన్ని తీసుకొని పక్కనే వున్న అడవిలోకి విడచి పెట్టాడు. ఇంతటి పొడుగాటి సర్పాన్ని చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు.

## బోయకొండపై తరగని యాత్రీకుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 17 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండపై యాత్రీకుల రద్దీ పెరిగింది. శ్రావణమాసం అయినప్పటికీ కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్య లో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఉదయాన్నే అమ్మ వారికి అర్చకులు, వేదపండితులచే వివిధ అభిషేకాలు, విశేష అలంకరణ నిర్వహించారు. సాయంత్రం వరకు క్యూలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## నేడు జనసేనచే జెండా ఆవిష్కరణ

చౌడేపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త

జనసేనపార్టీ ఆధ్వర్యంలలో ఈనెల 18న జెండా ఆవిష్కరణ వుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు గందోడి చరణ్‌రాయల్ తెలిపారు. నియోజకవర్గంలోని పులిచర్ల, సదుం, సోమల, చౌడేపల్లి, పఉపుంగనూరు పట్టణాల్లో జిల్లా నాయకుడు సోమశేఖర్ రాయల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుగుతాయనీ, జనసేనపార్టీ నాయకులు, వీరమహిళలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నేడు బీర్జేపల్లిలో సీతారామాలయ కుంబాభిషేకం

చౌడేపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త

మండలంలోని చారాల పంచాయతీ బీర్జేపల్లిలోని ఈనెల 18న సీతారాముల ఆలయ కుంబాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో విమానగోపుర కలశస్థాపన, ఉత్సవ మూర్తులకు సంప్రోక్షణా మహోత్సవాలు జరుగుతాయనీ, భక్తులు పాల్గొని సీతారాముల అనుగ్రహానికి పాత్రులు కావాలని వారు కోరారు.

## ఉచిత బస్సులు సరే మా పరిస్థితి ఏమిటి : ఆటో డ్రైవర్ల నిరసన

పలమనేరు టౌన్, 17 ప్రభాతవార్త:

ప్రభుత్వం మహిళలకు స్త్రీశక్తి పథకం పేరుతో ఉచిత బస్సు సర్వీసులు ప్రవేశ పెట్టడం సంతోషదాయకమని ఐతే మా పరిస్థితి ఏమిటని ఆటో డ్రైవర్లు నిలదీస్తున్నారు. ఆదివారం ఈ మేరకు భారీ ఎత్తున ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటోలను కూడా స్వాధీనం చేసుకోవాలని ఒక్కో ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.30 వేలు చెల్లించి ఆదుకోవాలని మేము కూడా 8 గంటలను పనిచేసి ఉచితంగా సర్వీసు చేస్తామని డిమాండ్ చేశారు. బ్రతుకు తెరవుకోసం ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తుంటే ప్రభుత్వం మా కడుపుల మీద కొట్టిందని ఆరోపించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటోలు ఇక తిరగాల్సిన పనిలేదన్నారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు అందజేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఏమైందని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేదంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డ్రైవర్లకు సత్కారం

చిత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:





స్వాతంత్రదిన్సోతం రోజున ఉత్తమసేవా పురస్కారం అందుకొన్న ప్రభుత్వ, కాంట్రాక్ట్ డ్రైవర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ అసోసియేట్ అధ్య క్షుడు పన్నీర్‌సెల్వం ఘనంగా సత్కరించారు. పారెస్టు డిపార్టుమెంట్ నందు విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం లేకుండా ఉత్తమ సేవాపథకం అందుకొన్న మురాద్‌భాషా, జాయింట్ కలెక్టర్ పేషిలో పనిచేస్తున్న ప్రకాష్, రూప్‌కుమార్, పదవీవిరమణ చెందిన హౌసింగ్ జయరాంలకు పూలమాల వేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించడంతో పాటు స్వీట్స్ బాక్స్ అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వవాహన డ్రైవర్లు హరిబాబు, షణ్ముఖ, రామన్న, సి.బాబు, రవికుమార్, వినాయక, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**పన్నీర్‌సెల్వంను సత్కరించిన ప్రభుత్వవాహన డ్రైవర్లు:**

ఇటీవల గుంటూరులోని ఏపి ఎన్జీవో భవనం నందు ప్రభుత్వవాహనడ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ సమావేశంలో ఏపి ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడుగా మాజీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వంను ఎన్నుకోవడంతో ఆదివారం ప్రభుత్వవాహన డ్రైవర్లు దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, డ్రైవర్లకు ఎటువంటి సమస్యలు వచ్చిన ముందుండి పోరాటం చేసే పన్నీర్‌సెల్వం మరిన్ని ఉన్నత పదవులు అలకరించాలని ఆశీర్వదించారు.

# బిసి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలుగా టి.మాలతి





అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.పి.వనజ, సభ్యులుగా బి.శాంతకుమారి

చంద్రగిరి, ఆగస్టు 17 ప్రభాతవార్త: చారిత్రాత్మక చంద్రగిరిలో వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న టి.మాలతి, ఎం.పి. వనజ, బి.శాంతకుమారి (కుప్పంబాదూరు) జిల్లా స్థాయి బిసి వెల్ఫేర్ అసోసియేషన్‌లో జిల్లాకు తమ ప్రాతినిధ్యం పొందడం ద్వారా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల వసతి గృహ సంక్షేమ అధికారుల అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా చంద్రగిరిలో విధులు నిర్వహిస్తున్న టి.మాలతి ఎన్నికయ్యారు. అదేవిధంగా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.పి.వనజ, కార్యవర్గ సభ్యురాలుగా బి.శాంతకుమారి (కుప్పంబాదూరు) ఎన్నికయ్యారు. రాష్ట్ర స్థాయి అసోసియేషన్ నాయకత్వం జిల్లా తరపున కొంతమంది పేర్లను పరిశీలనకు స్వీకరించి, ఆ మేరకు ఏకగ్రీవంగా నియమ కాలను చేపట్టారు. వృత్తి రీత్యా "వెల్ఫేర్ ఆఫీసర్స్"కుఎదురయ్యేసమస్యలనురాష్ట్రస్థాయికితీసుకెళ్ళి పరిష్కరించుకునేందుకు అవసరమైన పోరాట పటిమను పెంపొందించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో తగిన న్యాయం, సాయం చేయడమే లక్ష్యంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వెల్ఫేర్ ఆఫీసర్స్ వీరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎంజిఎంలో ఆర్ఎంపి డాక్టర్ల ఆత్మీయ సమ్మేళనం

శ్రీకాళహస్తి,ఆగస్టు 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని కార్పొరేట్ ఆసుపత్రి ఎంజిఎంలో ఆదివారం శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గా ల్లోని ఆర్ఎంపి డాక్టర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 150 మంది ఆర్ఎంపి డాక్టర్లు హాజరయ్యారు. డాక్టర్లకు ఎంజిఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆతిధ్యమిచ్చి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపి డాక్టర్లు తమ సమస్యలను చర్చించుకున్నారు. నేడు సమాజంలో అత్యవసర పరిస్థితిలో ఆదుకునేది ఒక్క ఆర్ఎంపి డాక్టర్లే అన్నారు. కానీ ఆర్ఎంపిలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందటం లేదన్నారు. ఇక వృత్తి రీత్యా ఆర్ఎంపిలు బాధలతో వచ్చిన వారితో స్నేహభావంగా పలకరించాలని వచ్చిన వారికి ఖచ్చితంగా వ్యాధిని గుర్తించి సేవలందించాలని చర్చించుకున్నారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కెవిబిపురం, నాయుడుపేట, వరదయ్యపాళెం, సూళూరుపేట, ఏర్పేడు, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు చెందిన ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై పైశాచిక దాడి

తొట్టంబేడు,ఆగస్టు 17 ప్రభాతవార్త



మండలంలోని చేమూరు దళితవాడలో శనివారం ఓ వృద్ధురాలిపై పైశాచిక దాడి జరిగినట్లు పోలీసులకు పిర్యాదు అందింది. ఈ మేరకు తొట్టంబేడు ఎస్ఐ బలరాం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను విచారించారు. బాధితులు అందించిన సమాచారం మేరకు గాలివెంకటమ్మ కుమారుడు గురవయ్య, కోడలు పార్వతమ్మలతో కలసి జీవిస్తున్నారు. కొడుకు కోడల మధ్య వివాదాలతో ఒరెండు రోజులుగా కోడలు కనబడటం లేదని తెలిసింది. దాంతో ఆదివారం పొద్దుపోయిన తరువాత వెంకటమ్మ ఇంటి ఆరుబయట మంచంపై కునుకు తీస్తుండగా కొడలి తమ్ముడు ఉపేంద్ర ఇంటి వద్దకు వచ్చి మంచంపై పడుకున్న వెంకటమ్మ వృద్దురాలు అని కూడా చూడక దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదు అందింది. దాంతో బంధువులు వెంకటమ్మను శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. ఎస్ఐ బలరాం వివరణ ఇస్తూ వెంకటమ్మ మీద దాడి జరిపినట్లు ఫిర్యాదు అందిందన్నారు. .నిందితుని కోసం వెతుకుతున్నామని ఎస్ఐ బలరాం వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయాలు

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి సమీపంలోని ఊరందూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సూళూరుపేటకు చెందిన యువకుడు గాయపడినట్లు సమాచారం అందింది, వివరాలు ఇలా ఉన్నాయి. సూళూరుపేటకు చెందిన యానాటి గిరిష్(27) తిరుపతి నుంచి బైపాస్ మార్గంలో సూళూరుపేటకు తన ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. ఊరందూరు బైపాస్ వద్దకు రాగా డివైడర్‌ను ఢీకొన్నాడు. బహుశా మోటార్‌సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఉండవచ్చునని ఎస్ఐ నరసింహారావు వివరించారు. సమాచారం అందిన వెంటనే ఆతన్ని 108లో తరలించారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో పరిస్థితి విషమించటంతో ఆతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి బంధువులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు

## శివయ్య సేవలో గుజరాత్ హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి,ఆగస్టు 17 ప్రభాతవార్త



వాయులింగేశ్వరుని సన్నిధిలో ఆదివారం గుజరాత్ హైకోర్టు జడ్జి సునీత అగర్వాల్ కుటుంబసభ్యులతో పూజలు జరుపుకున్నారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా ఆలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనం కోసం నిరీక్షించారు. గుజరాత్‌హైకోర్టు జడ్జి రాగా వారికి ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎఇఓ మోహన్‌లు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. అలాగే స్వామి అమ్మవార్ల చిత్రపటాలనుఅ ందించారు.

## శ్రీకృష్ణుని గ్రామోత్సవం



శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని సుబ్బా నాయుడు కండ్రిగ గ్రామంలో ఆదివారం శ్రీకృష్ణా ష్టమి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ద్వైత సిద్దాంత ప్రభోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సారధ్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వ హించారు. ఆదివారం గ్రామంలో శ్రీకృ ష్ణుని విగ్రహానికి చక్కగా అలంకరించి ఊరేగింపు జరిపారు. దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయన్నే భగవంతుడంటారు. ఆయనే శ్రీకృష్ణుడు ఆయన్ను ప్రతి ఒక్కరు దేవునిగా మాత్రమే పూజించాలన్నారు. శ్రీకృష్ణుడు పౌర్ణమి, అమావాస్య మధ్యలోజన్మించాడు. జ్ఞాన అజ్ఞానాలకు వారదిగా ఉన్నారంటూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షులు చింతా సుబ్రమణ్యం, తిరుమల, ధనంజయులు, రాజేష్, పెంచులయ్య, అమ రావతి, శ్రీనివాసులు, జయసుధ, హరిత, దీపిక, తిరుమలేశు, మధు తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షో ప్రారంభం

తిరుపతి విద్య ఆగస్టు 17 ప్రభాత వార్త




మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తిరుపతి షోరూం లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ ప్రత్యేక ప్రదర్శన ఆగస్టు 15 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నారు. బంగారం, వజ్రాభరణాలు, జాతిరత్నాభరణాలతో కూడిన ఈ ప్రదర్శనలో అద్వితీయమైన కళాత్మకతతో రూపొందించిన ఆభరణాలు వినియోగదారుల మన్ననలు పొందుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వి.ఉమా ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో మలబార్ ప్రత్యేక బ్రాండ్ల మైన్ ధ్రువీకరించిన వజ్రాభరణాలు, ఎరా అన్కట్ డైమండ్స్, ప్రెష్యా జాతిరత్నాలు, ఎత్నిక్స్ హస్తకళా ఆభరణాలు, జోల్ ఆధునిక తేలికపాటి డిజైన్లు, డివైన్ భారతీయ సంప్రదాయ ఆభరణాలు, పిల్లల కోసం స్టార్లెట్ ఆభరణాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. వినియోగదారుల విశ్వాసం కోసం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 11 న్యాయమైన వాగ్దానాలు అందిస్తోంది.

## గీతామందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పుత్తూరు రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం మందిరంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. వేదాంతం శ్రీనివాస పటాచార్యులు వారిచే ప్రవచనా కార్యక్రమాలు నిర్వహించారు. 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శ్రీ గీతా సేవాసమాజం వారు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన

రేణిగుంట ఆగస్టు 17 ప్రభాతవార్త



భద్రతపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. రేణిగుంట గుంటకట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద శ్రీ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో అర్బన్ సీఐ జయచంద్ర సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. అదేవిధంగా రూరల్ సర్కిల్ పరిధిలోని రూరల్ సీఐ మంజునాథ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా వారు వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ సిస్టం, రికార్డింగ్ డాన్సులు పెట్టకూడదన్నారు. తాగి తందనాలు ఆడితే కఠినంగా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, వృద్ధుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ జయచంద్ర, ట్రైనీ ఎస్ఐ స్వాతి తమ సిబ్బందితో పాల్గొనగా, రూరల్ సర్కిల్ నందు సిఐ మంజునాథ్ రెడ్డి, గాజుల గాజులమండ్యం ఎస్సై సుధాకర్, ట్రైన్ ఎస్సై ప్రవల్లిక సిబ్బంది పాల్గొన్నారు... ఇది ఇలా ఉండగా రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ జయచంద్ర రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

చంద్రగిరి, ఆగస్టు 17 ప్రభాతవార్త:

మండల పరిధిలోని నడింపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన దుర్ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. పూతలపట్టు – నాయుడు పేట జాతీయ రహదారి తిరుపతి నుండి చిత్తూరు వెళ్ళే ఆరు లైన్ల రహదారిపై నడింపల్లి వద్ద గుర్తు తెలియని మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినది. అయితే ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు పదేపదే మృతదేహంపై వెళ్ళడంతో మహిళ దేహం ఛిద్రమయ్యింది. దీంతో మృతురాలు ఎవరనే విషయం తెలియరాలేదు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని తదుపరి చర్యలు చేపట్టారు.

## వైభవంగా శ్రీ ద్రౌపదీదేవి అమ్మవారి ఊరేగింపు

పుత్తూరు రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు అనంతరం మొదటి ఆదివారం శ్రీ అర్జున శ్రీ ద్రౌపదీదేవి అమ్మవారు పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాలనడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఉభయ దాతగా పుత్తూరు కాపువీధికి చెందిన ఉదయగిరి కుమారి పీఎంపీ వైఫ్ ఆఫ్ ఉదయగిరి సుబ్రహ్మణ్యంరాజులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

తిరుపతి విద్య, ఆగస్టు 17 ప్రభాతవార్త




తిరుపతి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఓ పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు గా డాక్టర్ పాకనాటి హరికృష్ణ. కార్యదర్శిగా పి రామచంద్రయ్య, ఉపాధ్యక్షు లుగా ఆనందరావు, ఓంప్రకాష్రెడ్డి, రాఘువులు, డాక్టర్ వెంకటేశ్వర్లు, బి రామయ్య. కోశాధికారిగా కృష్ణప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా డాక్టర్ రామకృష్ణారెడ్డి ఎంపికకాగా, మరో ఆరు మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్, మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆసియా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వంటి సంస్థలకు అనుబంధంగా జిల్లా కమిటీ పనిచేస్తుందని తెలిపారు. ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్ కు అంతర్జాతీయ, జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ గుర్తింపు ఉండడంతో విజేతలు స్పోర్ట్స్ రిజర్వేషన్లు పొందేందుకు అర్హులన్నారు. మాస్టర్ అథ్లెటిక్స్ లో పాల్గొనడానికి అథ్లెట్లు సాధారణంగా 30 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. అర్హులైన ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## భగవద్గీత మానవాళికి దిక్సూచి

శ్రీకాళహస్తి,ఆగస్టు 17 ప్రభాతవార్త



భగవంతుని ముఖ పద్మముల నుంచి వెలువడిన భగవద్గీత మకరందం మానవాళి మనుగడకు దిక్సూచి అని శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి ఆది వారం తెలిపారు. ఆయన మట్లాడు తూ భగవద్గీతను పఠించటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని జీవితంలో సరైన మార్గాన్ని చూపిం చటం బత్తిడి తగ్గించటం నైతిక విలువ పెంపొందించటం జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనే ధైర్యం వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీతను పఠించటంలో ఓ తీయని అనుభూతి ఉంటుందన్నారు. ఈ దివ్యగ్రంధం ప్రతి సమస్యకు ఓ పరిష్కారం చూపుతుందని వివరించారు. ప్రభుత్వం ఇలాంటి దివ్యగ్రంధాన్ని విద్యార్థి దశ నుంచే అలవాటు చేయటానికి పాఠ్యపుస్తకాల్లో ఓ పాఠంను పొందుపరచాలని మునికృష్ణారెడ్డి కోరారు. ఆదివారం ఆయన పలువురికి భగవద్గీత దివ్యామృంతాన్ని పలువురికి పంచిపెట్టారు.

## మహాభారత జ్ఞానపీఠ అవార్డులు:

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 17 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట కేంద్రంలో నిర్వహి స్తున్న ధార్మిక ట్రస్టు ఎంజీఎం సారధ్యంలో మహాభారత జ్ఞాన పీఠ అవార్డులను ప్రకటించింది. మహాభారతానికి సంబం ధించి ఇటీవల మహాభారతానికి సంబంధించి పోటీలు నిర్వహిం చినట్లు ట్రస్టు నిర్వాహకులు అర్జున్‌బాబు ఆదివారం తెలిపారు. ధర్మ రాజుల స్వామి ఆలయంలో నిర్వహించిన పోటీల్లో 52 మంది పాల్గొన్నారని వారిలో 41 మందికి 25కుపైగా మార్కులు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో చైతన్య అనే విద్యార్థికి 38మార్కులతో మొదటి స్థానం సాధించారని 37.5 మార్కులతో జీపాళెంకు చెందిన దాము, 36.5 మార్కులతో ఓ సురేష్ మూడవ బహుమతి దక్కించుకున్నారు. విజేతలకు బహుమతులందించారు. 25 పైగా మార్కులు వచ్చిన వారికి కూడా బహుమ తులను అందించారు. ఈ కార్యక్రమాల్లో కృష్ణప్ప మొదలి, సీతాపతి, తంబ శ్రీని, అర్జున్‌బాబు, రవి కుమార్, సుకకని శ్రీను, విజయ్, సోము, రమేష్, త్యాగరాజా తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కేవీబీ పురం, ఆగస్టు 17 ప్రభాతవార్త:



మండలంలోని మఠం గ్రామం వద్ద ఆగస్టు 8వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు గిరిబాబు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... ఆగస్టు 8వ తేదీ రాత్రి మఠం గ్రామం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నింద్ర మండలం కావనూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు గిరిబాబు(27) తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు గిరిబాబు అడ్వకేట్ చేసి పుత్తూరు పట్టణంలో ఓ సినియర్ అడ్వకేట్ వద్ద జూనియర్ అడ్వకేట్‌గా పని చేస్తున్నట్టు తెలిపారు. అలాగే మృతునికి భార్య హేమతో పాటు నాలుగు నెలల కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

## 22ఏ నిషేధ జాబితా నుంచి తమ భూములు తొలగించాలి

తిరుపతి హెల్త్, ఆగస్టు 17 ప్రభాతవార్త :



దామినేడు గ్రామ లెక్క దాఖలో సర్వే నెంబర్ 19, సంబంధిత సర్వే నెంబర్లల్లో ఉంటున్న తమ భూములను 22ఏ సెక్షన్ నుంచి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని దామినేడు బాధితులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత ప్రజలు నాగేశ్వరరావు, మీరయ్య, పద్మావతి, పద్మశ్రీ మాట్లాడారు. తమ భూములను 22ఏ నుంచి తొలగించాలని రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. రైతులు, ప్రజలు ఇండ్లు కట్టుకునేందుకు ఇతర లావాదేవీలు జరుపుకునేందుకు వీలుగా అనేక ఏళ్ళగా ఇబ్బందులు పడుతున్నామని, కూటమి ప్రభుత్వ వెంటనే స్పందించి దామినేడు, భూముల, ఇళ్ళ స్థలాల యజమానుల రికార్డుల ఆధారాలను పరిశీలించి 22ఏ జాబితా నుంచి తమ భూములను తొలగించాలని కోరారు.

## ఆడి మాసంలో కరుమారియమ్మకు పూజలు

తిరుపతి రవాణ,ఆగస్ట్ 17 ప్రభాతవార్త



ఆడిమాసం ఆదివారం సందర్భంగా తిరుపతిలోని కరుమారియమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. గతనెలరోజులుగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు చేసిన ఆలయ అర్చకులు ఆదివారం చివరిరోజున విశేష ప్రత్యేక పూజలు జరిపించారు. చివరిరోజు అగ్నిగుండ మహోత్సవం, గాజుల అలంకరణ ,కూరగాయల అలంకరణ ప్రత్యేకత. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, ఆలయ ఛైర్మన్ నాగేశ్వరరావు, భక్తులు బాబు, ఆనంది, మాధవ్, ప్రకాశ్, వెంకటరమణ, మునస్వామి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కెఎన్ రాజ తదితరులు పాల్గొన్నారు. భక్తులందరికీ అమ్మవారి దీవెనలు కలగాలని ప్రార్థించారు.

## వివేక్ వెంకటస్వామికి ఘనస్వాగతం

తిరుపతి రవాణ,ఆగస్ట్ 17ప్రభాతవార్త



తెలంగాణమంత్రి వివేక్‌వెంకటస్వామికి ఆదివారం ఉదయం తిరుపతిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. తెలంగాణ కార్మికశాఖ మంత్రి వెంకటస్వామి ఆదివారం తిరుపతి పర్యటనకు రావడంతో తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరచిట్టిబాబు, చిత్తూరుశివశంకర్, తలారి గోపీచంద్, కల్యాణ్ దుశ్శాలువతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## డిఎ బకాయిలు కోసం చీర్లకిరణ్ హైకోర్టుకు

తిరుపతి రవాణ,ఆగస్ట్ 17ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన డిఏ బకాయిలు కోసం రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు చీర్లకిరణ్ హైకోర్టును ఆశ్రయించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఏ బకాయిలను రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని లక్షలాదిమంది ఉద్యోగులు తరపున ఆయన హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. సిపిఎస్ రద్దుకోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేసి, ఆ పోరాటం ఫలితంగా మృతిచెందిన సిపిఎస్ ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీపెన్షన్, డెత్‌గ్రాట్యుటీ సాధించిన ఏకైక అసోసియేషన్‌గా సిపిఎస్ చరిత్రలో నిలిచిపోయిందన్నారు.

## ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయండి

– సీఐటీయూ కరపత్రాలు విడుదల

పుత్తూరు రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:



ఆటో కార్మికుల తిరుపతి జిల్లా రెండవ మహాసభ ఈ నెల 19న వేమన విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, అందులో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పుత్తూరు ఆటో స్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఆటో యూనియన్ కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఆటో కార్మిక సమస్యపైన అనేకమైనటి పోరాటాలు చేసి ఫలితాలు సాధించారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా వాగ్దాన చేశారు. మేం అధికారానికి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, సబ్సిడీలో ఎలక్ట్రికల్ ఆటోలు అందజేస్తామని, ఆటో స్టాండ్‌లోనే చార్జింగ్ పాయింట్స్ ఏర్పాటు చేస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి అవి ఏవి అమలు చేయకుండా ఇప్పుడు అధికారంలోకి వచ్చినాక ఉచిత బస్సు పథకం మా జీవితాలకు ఉరితాడు లాగా బిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏ.విజయ్, యాషన్ బాషా, దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పుత్తూరు రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:



భారత కమ్యూనిస్టు పార్టీ 28వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో జరగనున్నాయని ఈ మహాసభలు జయప్రదం చేయాలని పుత్తూరు మండల కార్యదర్శి డి.మహేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో కరపత్రాలు, గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భారత గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, ఈ కాలంలో అనేక పోరాటాలను అనేక విజయాలను సాధించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 14 నెలల పాలన పూర్తి చేసుకుంటున్న ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేస్తోందని పేర్కొన్నారు. 23వ తేదీ జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్మిక వర్గం పేద ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పుత్తూరు కార్యదర్శి మహేష్, ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుభాషిణి, శాంతి, నాయకులు చంద్రబాబు, శ్రీనివాసులు, గోపి, సెలవు రాజాచారి, కృష్ణారెడ్డి, మునిరత్నం, చాముండేశ్వరి, హేమలత, మారెమ్మ, ధనలక్ష్మి, వెంకట రమణమ్మలు పాల్గొన్నారు.

## వరకట్నం వేధింపులపై కేసు నమోదు

కేవీబీ పురం, ఆగస్టు 17 ప్రభాతవార్త:

వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... మండలంలోని ఆరె గ్రామానికి చెందిన ఏ.గౌరి అనే మహిళకు సుమారు ఐదేళ్ళ ముందు అదే గ్రామానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే పెళ్లి సమయంలో కట్న కానుకల్లో భాగంగా బంగారంతో పాటు, కొంత నగదు ఇచ్చారు. కొద్ది రోజులకే భర్త వ్యసనాలకు బానిస కావడంతో తరచూ ఇంట్లో గొడవలు జరిగేవి. అప్పటి నుంచి తాను తెచ్చిన కట్నం సరిపోదంటూ భర్త, కుటుంబీకులు తనను చిత్రహింసలు పెట్టేవారని, అయినప్పటికి తాను అన్ని భరించి కాపురాన్ని నెట్టుకొస్తున్నానని గౌరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త, అత్తలు తనకి తెలియకుండా తాను తినే ఆహారంలో విషం కలిపి హతమార్చాలని చూశారని ఫిర్యాదులో పేర్కొంది. తనకు ప్రాణహాని జరిగితే తన బిడ్డ అనాథగా మారుతాడని, తనను రక్షించాలని పోలీసులను కోరింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం



సూళ్లూరుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ మందిరం వద్ద ఉట్టి మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, చిన్నారులు ఉట్టి మహోత్స వంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతుల సహకారంతో నగదు బహుమతి అందజేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పాండురంగ స్వామి దేవస్థానంలో స్వామివారిని భక్త జనుల భజనలతో గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదరపాక బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## కేవీ హాస్పిటల్‌చే వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం



గూడూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: పట్టణంలోని మాయా బజార్‌లో ఉన్న కేవీ హాస్పిటల్‌లో బీపీ షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు ఎక్కువగా నివసించే ప్రాంతంలో గోపాల్ అతిపెద్ద కె.వి హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి మంచి వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. కేవీ హాస్పిటల్ జిబిఆర్ ఫౌండేషన్ వారు 200 రూపాయలకే రెండు నెలలకు సరిపడా మందులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. గోపాల్, డాక్టర్లు త్రివిక్రమ్, కీర్తి నారా, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : డిఎస్పీ



గూడూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాలకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని గూడూరు డీఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డి.ఎస్పీ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డిజె బాణాసంచాలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు పాటించి ప్రతి ఒక్కరు ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్, కిషోర్ బాబు, ఎస్ఐలు తిరుపతయ్య, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరును జిల్లాగా ప్రకటించాలి జిల్లా సాధన సమితి



గూడూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త : గూడూరు జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలని గూడూరు పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ని కలిసి గూడూరును జిల్లా కేంద్రంగా చేయవలసిందిగా వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకి అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేసే ప్రక్రియ జరిగితే గూడూరును తప్పనిసరిగా జిల్లా చేయించేందుకు కృషి చేస్తానని మంత్రుల కమిటీ వద్దకు గూడూరు ప్రజల కోరికను, ఆకాంక్షను అందరి అభిప్రాయాలను మంత్రుల కమిటీ వద్దకు తీసుకుపోతానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గూడూరు పర్యటనకు వచ్చినప్పుడు మంత్రి లోకేష్ హామీ ఇచ్చిన మేరకు గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలి. అలా లేనిపక్షంలో గూడూరులో వారు ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని కోరుతానని చెప్పారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలిపినందువల్ల సాధారణ ప్రజలు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, అన్ని రంగాల వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, తిరుపతికి వెళ్లాలంటే 140 కిలోమీటర్ల పైగా ప్రయాణించాల్సి వస్తుందని గూడూరును గనుక జిల్లా చేసినట్లయితే చిల్లకూరు మండలంలో అనేక పరిశ్రమలు ఉన్నాయని నాయుడుపేటలో మేనకూరు సెజ్, ప్రధానంగా తిరుపతి, చెన్నైకి వెళ్లాలంటే రైల్వే జోన్, పెద్ద రెవిన్యూ డివిజన్, ఉన్నందున ప్రజల ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తానని అలా చేయలేని పక్షంలో గూడూరును నెల్లూరు జిల్లాలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు నెల్లూరులో కలిపే దానికి తప్పనిసరిగా ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు జిల్లా సాధన సమితి కన్వీనర్ వేగూరు రాజేంద్రప్రసాద్, సుమన్ రెడ్డి, అశోక్, గోపి, పురుషోత్తం, పసల వెంకటేశ్వర్లు, అరుణ్ కుమార్, దినేష్, ఇబ్రహీం, సంతన్, విజయ్, రాజేష్, శివ, మధు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 28న ఒంగోలులో జరిగే మహాసభలును జయప్రదం చేయాలి

-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యదర్శిలు పిలుపు



గూడూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: పోరాటాల రథసారథి భారత కమ్యూనిస్టు పార్టీ, ఒంగోలులో జరిగే సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలు ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన ప్రచార గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2025 డిసెంబర్ 26 నాటికి నూరు సంవత్సరాలు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలు నిర్వహించుకోబోతున్నదని కొనియాడారు. కార్మికుల పని గంటలు, కనీస వేతన చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. దళిత, గిరిజన, మహిళలు, మైనార్టీలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి సాధన కోసం సీపీఐ నిరంతరం పోరు సాగిస్తుందన్నారు. ఈనెల ఆగస్టు 23న ఒంగోలులో జరిగే రాష్ట్ర సిపిఐ 28వ మహాసభల ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని నియోజకవర్గంలోని సీపీఐ, అనుబంధ సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ నాయకులు కత్తి రవి, ఏ.ఐ.టి.యు.సి నియోజకవర్గ అధ్యక్షులు సి.వి.ఆర్ కుమార్, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు రాజా, చెంచు రామయ్య, బాల, మస్తాన్ వలి, ఇన్సాఫ్ నాయకులు జమాల్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షం వచ్చింది... జ్వరాలు తెచ్చింది!

కోట,ఆగస్టు 17 ప్రభాతవార్త : మండలంలో కొద్ది రోజులగా మబ్బులతో కూడిన వాతావరణం, తరుచూ వర్షాలు ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఖాళీ ప్రదేశాలు మురికి కూపాలుగా తయారయ్యాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో వల్ల బ్యాక్టీరియా వైరస్ ,ఫంగస్ వంటివి వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఇన్ ఫెక్షన్లు సోకి జనం జ్వరాలు బారిపడుతున్నారు. కుటుంబంలో ఒకరికి జ్వరం సోకితే ఇంటిల్లిపాదికి వ్యాప్తి చెందుతుంది. ఈ నేపధ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. జలుబు,దగ్గు,గొంతు నొప్పి డయేరియా, వాంతుతో ఆసుపత్రులకు ఎక్కవ మంది రోగులు వస్తున్నారు.40 శాతం మంది కాలానుగుణ వ్యాదులతో బాదపడుతున్నారు. తీవ్రమైన వైరల్ జ్వరం ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. జ్వర పీడితుల్లో ప్లేట్ లేట్లు తగ్గి పోయి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. దీర్ఘకాలిక వ్యాధిస్తులు,రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు వృద్దులు, పిల్లలు ఆయా సమస్యలతో ఎక్కవగా ఆసుపత్రులకు వెళ్లుతున్నారు.ప్రభుత్వ, ప్రేవుటు ఆసుపత్రుల్లో జనంతో కిటాకిటలాతున్నాయి.

## జేవివి లాంటి సంస్థలు సమాజానికి అవసరం : కమిషనర్



గూడూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆర్.ఆర్. జనరల్ మర్చంట్ అధినేత ప్రభాకర్ దాతృత్వంలో విశ్రాంత ఉద్యోగుల భవనము నందు దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు, వేరుశనగ ముద్దలును ముఖ్య అతిథి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ చేయడమైనది. కమిషనర్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక లాంటి సంస్థలు సమాజానికి చాలా అవసరమని సమాజంలో ఉన్నటువంటి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తున్నందుకు చాలా అభినందనీయ మన్నారు. ప్రత్యేకించి గూడూరు జనవిజ్ఞాన వేదిక 12 సంవత్సరముల నుండి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ, రెండు సంవత్సరాలు పైగా దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం చాలా గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన ప్రభాకర్ గారిని అభినందిస్తూ మంచి కార్యక్రమాలు చేస్తున్న జే.వి.వి. సభ్యులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాసచారి, అశోక్, అరుణ్ కుమార్, దినేష్, జాన సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- జిల్లా భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షులు కత్తి రవి



గూడూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే, తిరుపతి జిల్లా భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షులు కత్తి రవి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని ఏ. ఐ.టి.యు.సి కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం గూడూరు ఏ.ఐ.టి.యూ.సి నియోజకవర్గ అధ్యక్షులు సి.వి.ఆర్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు లేబర్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొని భవన నిర్మాణ కార్మికులకు లేబర్ గుర్తింపు కార్డు, ఇన్సూరెన్స్, చట్టాల పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు లేబర్ గుర్తింపు కార్డు, ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గూడూరు భవన నిర్మాణ కార్మికుల కన్వీంగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మీరా బాబు, సభ్యులుగా రాజా, చెంచు రామయ్య, బాల, మస్తాన్ వలిలను ఎన్నుకున్నారు. అనంతరం లేబర్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ లను భవన నిర్మాణ కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## దగ్గుబాటి వ్యాఖ్యలపై నిరసన



కోట, ఆగస్టు 17 ప్రభాతవార్త: కోటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజూరు మాధవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మీజూరు మాధవ్ మాట్లాడుతూ కారంచేడు ఘటనకు కారకులెవరూ దేశం మొత్తానికి తెలుసని, ఆ ఘటనను వక్రీకరిస్తూ కత్తి పద్మారావుపై బురదచల్లే కార్యక్రమాన్ని అగ్రవర్ణాలు కుట్రపూరిత ధోరణితో అవలంభిస్తున్నాయని ఆరోపించారు. దాసరి సుందరం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు ఏగూరు విజయకుమార్, పనబాక హేమంత్, పాల మల్లి, శంకరయ్య, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పరసా కస్తూరమ్మ వర్ధంతి



సూళ్లూరుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : మాజీమంత్రి పరసా రత్నం సతీమణి పరసా కస్తూరమ్మ 5వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా రత్నం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. మాజీ టిటిడి బోర్డు సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని పరసా కస్తూరమ్మకు ఘన నివాళి అర్పించారు.

## ఆర్టీసీ కార్మికుల ధర్నా



సూళ్లూరుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.పద్మను ఇన్‌ఛార్జ్ డిపో మేనేజర్ మునిచంద్ర అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు నాయకులు ఎం.శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పద్మను సస్పెండ్ చేశారని, తక్షణమే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో వర్షం

నాయుడుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఆదివారం నుండి వర్షాలు కురవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఈ వర్షాలతో గ్రామీణరోడ్లు, గ్రామాల్లో వీధులు బురదమయంగా మారుతున్నాయి. రైతులు ఎడగారుసాగు చేపట్టి వరిపైరు కోతదశలో ఉండటంతో కురుస్తున్న వర్షాలకు వరిపైరు నేలకొరుగుతుంది. పంటపొలాల్లో నీరుచేరడంతో అన్నదీతలు అవస్థలు పడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో రైతులు వరికోతలు కోస్తూండగా వర్షాలు కురవడంతో ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పుకుంటూ అవస్థలు పడుతున్నారు.

## మండపాలకు అనుమతి తప్పనిసరి : సిఐ



ఓజిలి, ఆగస్టు 17 ప్రభాతవార్త: వినాయక చవితి వేడుకలకు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని నాయుడుపేట రూరల్ సిఐ సంగమేశ్వర రావు సూచించారు. శనివారం ఆయన గణేష్ ఉత్సవ కమీటిలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడు తూ గణేష్ విగ్రహ ప్రతిష్ట, పందిళ్లు, మండపాల ఏర్పాటుకు ఐదు గానీ, అంతకంటే ఎక్కువ మంది సభ్యులు కమిటీగా ఏర్పడి వారి వివరాలు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తప్ప నిసరని అన్నారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యబండపై మోపిన జనపాదం-వారికదే స్వర్గధామం

-కన్నుల పండుగలా తిరుణాళ్ళు -అలరించిన ఉట్లోత్సవం



చౌడేపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త: మండంలోని వెంగళపల్లి పంచాయతీ రాజనాల బండపై ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ క్షేత్ర పాలకుడు ప్రసన్న ఆంజనేయస్వామి తిరుణాళ్ళు కన్నుల పండుగలా జరిగాయి. శ్రీఆంజనేయం ప్రసన్న ఆంజనేయం నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయంలో ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేకాభిషేకం, విశేషాలంకరణ నిర్వహించారు. బండ ఈనిండా అన్నట్లుగా జనం చేరుకొన్నారు. ఏడు గ్రామాల నుంచి దేవరెద్దులను తీసుకొచ్చి ఓ చోటవుంచి వాటికి విశేష పూజలు నిర్వహించారు. దేవరెద్దుల ఊరేగింపులో కోలాటలు, పిల్లనగ్రోవి, దప్పులు భక్తులను అలరించాయి. చుట్టు పక్కల యువకులచే నిర్వహించబడ్డ పోకమాను బరగడం, ఉట్లోత్సవం చూపరులకు కనువిందు చేసింది. తిరుణాళ్ళను బోయకొండ గంగమ్మ సూక్ష్మరూపంలో వచ్చి చూడటాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూపించారు. టిటిడి ఆధ్వర్యంలో తిరుణాళ్ళు జరిగాయి. దీంతో కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నారు. రాజనాలబండ యువత భక్తులకు ఉచిత అన్నదానం, వసతులు సమకూర్చారు. చౌడేపల్లి నుంచి సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్ తొలి కలశాన్ని తీసుకెళ్ళి స్వామివారికి సమర్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసన్న ఆంజనేయస్వామికి ముడుపులు చెల్లించారు.

## సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌హిట్ : ఎమ్మెల్యే

పలమనేరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అయ్యాయని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ, రైతు భరోసా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన పెన్షన్లు రూ.3 వేల నుండి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేలు చేశామన్నారు. అంతకు ముందు నెలకు వెయ్యి వంతున మూడు నెలలకు పెన్షన్లతో కలిపి ఒకే సారి అప్పట్లో రూ.7 వేలు అందజేశామని తెలిపారు. వికలాంగులకు, కిడ్నీ పేషెంట్లకు, క్యాన్సర్ పేషంట్లకు, రూ.10 వేల వరకు అందజేస్తున్నామని పేర్కొన్నారు. దీపం పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ పథకం దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. రైతు భరోసా పథకం ద్వారా ఒక్కో రైతుకు రూ.20 వేలు అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఇందులో భాగంగా మొదటి విడతగా 7 వేలు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. ఇక తల్లికి వందనం పథకం ద్వారా ఒక ఇంట్లో ఎంత మంది ఆడపిల్లలుంటే అంతమందికి రూ.20 వేలు వంతున తల్లుల ఖాతాల్లో జమచేశామని తెలిపారు. ఈ నెల 15 నుండి స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం దిగ్విజయంగా అమలు చేస్తున్నామని ల్యాండ్ టైటిలింగ్ రద్దుచేసి రైతుల్లో ధైర్యం నింపామని వివరించారు. అంతకు ముందు ఎంబిటి రోడ్డులో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## కేవీబీ పురం టీడీపీ అధ్యక్షుడి నియామకంపై ఉత్కంఠ

ముగ్గురు నేతల మధ్య పోటీ

కేవీబీ పురం, ఆగస్టు 17 ప్రభాతవార్త: కేవీబీపురం మండలంలో తెలుగుదేశం పార్టీ అంతర్గత రాజకీయాలు ఉధృతంగా మారాయి. మండల అధ్యక్షుడి పదవి ఖాళీ కానుండడంతో పార్టీ అధిష్టానం నూతన నాయకత్వం ఎంపికపై చర్చలు జోరందుకున్నాయి. ఈ ప్రతిష్టాత్మక పదవికి ముగ్గురు సీనియర్, ప్రభావశీల నేతలు అయినా కనపర్తి గోపినాథ్‌రెడ్డి, మునస్వామి, మల్లికార్జున్‌రెడ్డిలు బరిలోకి ఉన్నారు. అనుభవజ్ఞుడైన క్రమశిక్షణ గల నాయకుడు, పార్టీ కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహించడంలో గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కార్యకర్తలతో సమన్వయం కల్పించడంలో గోపినాథ్‌రెడ్డికి మంచి పేరుంది. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి యువతను పార్టీ కార్యక్రమాలకు దగ్గర చేస్తున్న మంచి నాయకుడిగా పేరుంది. తక్కువ సమయంలోనే విభిన్న వర్గాల మద్దతును సంపాదించగల శక్తి గోపినాథ్‌రెడ్డి ప్రత్యేకత. గ్రామీణ ప్రాంతాల్లో గట్టి పట్టు కలిగిన నాయకుడు, పేదల సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడూ మునస్వామియాదవ్ ముందుంటారు. అలాగే మూడు పర్యాయాలు పార్టీ అధ్యక్షుడిగా, 10 సంవత్సరాలు మండల జనరల్ సెక్రటరీగా, రెండు సార్లు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా, క్లస్టర్ ఇన్‌చార్జిగా, ప్రస్తుతం రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన అనుభవం ఆయనకు కలసివచ్చే అంశంగాఉంది. యువజన శక్తిని ఆకర్షించే, పదునైన వక్త, పార్టీ సిద్ధాంతాలను జోరుగా, చైతన్యవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో మల్లికార్జున్‌రెడ్డికి సామర్థ్యం విశేషం. యువతలో విశేష ఆదరణ కలిగిన మల్లికార్జున్‌రెడ్డి, తన ఉత్సాహం, ఆర్గనైజింగ్ స్కిల్స్‌తో హై కమాండ్ దృష్టిని ఆకర్షిస్తున్నారు. అప్పటి వరకు కేవీబీ పురం రాజకీయ వాతావరణం వేడిగానే ఉండనుంది.

## దొంగ బిల్లులతో గ్రావెల్ దోచేస్తున్నారు!





విజయపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త: దొంగ బిల్లులతో గ్రావెల్ దోచేస్తున్నారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. నిత్యం వందలాది గ్రావెల్ లారీలు తరలి పోతున్నా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని వాపోతున్నారు. చిత్తూరు జిల్లా విజయపురం మండలం మహారాజపురంలో జిల్లా మైనింగ్ అధికారుల ద్వారా అనుమతి తీసుకుని గ్రావెల్ తరలిస్తున్నారు. మహారాజపురం రెవెన్యూ సర్వే నెం.182/4,5 పేరుతో, సర్వే నెం.182/పీ పేరుతో అనుమతి మంజూరు చేశారు. కానీ గ్రావెల్ అదే సర్వే నెంబరులో తరలించకుండా ఇష్టానుసారం తరలిస్తున్నారని జిల్లా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

**సంబంధం లేని బిల్లులతో గ్రావెల్ తరలింపు:**

విజయపురం మండలం మహారాజపురంలో గ్రావెల్ తరలించడానికి నగరి మండలం కాకవేడు, పాలసముద్రం, నగరి, సత్యవేడు పేరుతో ఉన్న బిల్లులతో విజయపురం మండలం మహారాజపురం నుంచి గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రావెల్‌ను తమిళనాడులోని హైవే పనులను వాడుతున్నా మని చెప్పి ప్రైవేటు వ్యాపారం చేస్తున్నారని, వారిచ్చే బిల్లులోనే చెన్నై 70 కి.మీ అంటూ బిల్లు వేసి గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వాపోతున్నారు. గ్రావెల్ తరలించే ప్రాంతం నుంచి 50 కి.మీ లోపు హైవే రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, కానీ 70 కి.మీ వరకు గ్రావెల్ తరలిస్తు న్నారని స్థానికులు చెబుతు న్నారు. స్థానికులు, వైసీపీ నాయకులు దొంగ బిల్లులో మట్టిని మాఫియా చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారులు ఆరు టిప్పర్లను సీజ్ చేసి తూతూ మంత్రంగా పెనాల్టీ వేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హైవే పేరుతో...**

హైవే రోడ్డుకు గ్రావెల్ తరలిస్తున్నామంటూ అనుమతి పొంది ప్రైవేటు వ్యాపారులకు మట్టి విక్రయించి కోట్లకు సంపాదిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. క్వారీ యజమానులు పొందిన అనుమతికి వారు తరలించే మట్టికి సంబంధం లేదని, గోరంత అనుమతితో కొండంత మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదు చేస్తున్నారు.

## టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా ఉట్లోత్సవం



నారాయణవనం, ఆగస్టు 17 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని రెండవరోజు ఉట్లోత్సవం ఘనంగా జరిగింది. ఉట్టిని కొట్టడానికి యువకులు పోటీ పడ్డారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, శ్రీకృష్ణుడు సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరున్ని మాడవీధుల్లో తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సిబ్బంది భరత్, కైలాసం, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలకు ఉచిత బస్సు వర్తించదు

తిరుపతి రవాణ,ఆగస్టు 17 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలకు తిరుపతి నుండి నడిచే ఆర్టీసి బస్సుల్లో, విద్యుత్ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం వర్తించదని తిరుపతి జిల్లా ఆర్టీసి అధికారులు తెలిపారు. తిరుపతి నుండి తిరుమలకు వెళ్ళే ఏ ఆర్టీసి బస్సులో స్త్రీశక్తి పథకం వర్తించదని తిరుపతి జిల్లా ఆర్టీసి అధికారులు స్పష్టం చేశారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లలో 90 రూపాయలు ఛార్జీగా, గరుడ ఏసి బస్సుల్లో 110 రూపాయలు ఛార్జీగా ఉందన్నారు. తిరుమలకు వెళ్ళే శ్రీవారి భక్తులు దీన్ని గమనించాలని ఆర్టీసి అధికారులు కోరారు. తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండ్ నుండి శ్రీవారిమెట్టు వరకు మరిన్ని బస్సు సర్వీసులను నడపాలని టిటిడి కోరికతో ఆర్టీసి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్,ఆర్డినరీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

వార్త ప్రభావం

## జాతిపిత మహాత్మా గాంధీకి చెర విముక్తి



రేణిగుంట ఆగస్టు 17 ప్రభాతవార్త : "ఆక్రమణ చెరలో గాంధీ" అనే శీర్షికతో వార్త దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథ నానికి రేణిగుంట అర్బన్ సిఐ జయచంద్ర స్పందించారు. ఆదివారం సీఐ జయచంద్ర, ట్రైన్ ఎస్పై స్వాతి, తమ సిబ్బం దితో గాంధీ విగ్రహం వద్ద అక్రమలపై దృష్టి సారించారు. దగ్గరు ండి ఆక్రమణాలను తొలగించారు. గాంధీ విగ్రహాన్ని ఆక్రమ ణదారుల నుండి బంధ విముక్తులను కలిగించారు. ఈ సందర్భంగా సిఐ జయచంద్ర మాట్లాడుతూ గాంధీ విగ్రహం ముందు ఎవరైనా దుకాణాలు పెట్టి ఆక్రమణకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జాతిపితకు గౌరవం ఇవ్వాలన్నారు. పోలీస్ సిబ్బంది ఎప్పుడు గాంధీ విగ్రహ ప్రాంతాన్ని పర్యవేక్షి స్తుందని ఎవరైనా ఆయన విగ్రహానికి ముందు దుకాణాలు పెడితే ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు.

## నుదుటిన తిరునామం... ఆద్యంతం ఎస్పీ భక్తిభావం



తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో మనసు ఆనందం కలుగుతుందని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. నుదుటిన తిరునామం ధరించి ఆద్యంతం భక్తితో దైవ దర్శనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో కుటుం బంతో కలసి శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సంగోపాంగ శ్రీనివాస... విశ్వశాంతి మహాయాగం ఆరంభం



తిరుమల, ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి: ధర్మగిరి వేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠంలో సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం మొదలైంది. ఆదివారం సాయంత్రం వేదోక్తంగా మొదలైనయాగంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఎస్వీవేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్యం అవధాని, వేదపండితులు పాల్గొన్నారు.